రామనాథం కొడుకు శివం పెరిగి పెద్దవాడయ్యాడు. రేపో మాపో ఉద్యోగంలో చేరేందుకు విజయవాడ వెడుతున్నాడు. ఇన్ని రోజులూ కొడుకును కట్టుదిట్టంగా పెంచాడు రామనాథం. వివిధ వ్యసనాలకు నిలయమైన సమాజం భ్రష్టుపట్టిపోయింది. తన కుమారుడు వ్యసనానికి లోన వుతాడేమోనని రామనాథం బెంగ. ఆలోచించి ఆలోచించి ఒక పథకాన్ని రూపొందించాడు. వ్యసనాలకు బానిసలయినవారి వికృష్ట జీవితాలను తన కొడుక్కి చూపెట్టి వ్యసనాలంటే ద్వేషం కలిగేలా చేయాలన్నదే రామనాథం ప్రయత్నం.

# అరరె!!

## - నాగభైరవ ఆంజనేయులు



ఆ రోజు కొడుకు శివాన్ని తన మిత్రుడు పరంధామం వద్దకు తీసుకెళ్ళాడు. పరంధామం లంగ్ కాన్సర్‌తో చావుబ్రతుకుల మధ్యనున్నాడు. "వీడు నా కన్నా చిన్నవాడు. రోజూ సిగరెట్లు తగలేసి ఆస్తిని కాల్చేసి ఇప్పుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సిగరెట్లు ఎంత అనర్థాన్ని తెస్తాయో చూశావా?' అంటూ హితబోధ చేశాడు రామనాథం.

జన్మలో సిగరెట్లు తాగకూడదు అన్న నిర్ణయానికొచ్చిన శివం ఆ విషయాన్ని తండ్రికి చెప్పాడు. ఆనందాన్ని దాచుకునేందుకు మనసు సరిపోలేదు రామనాథానికి.

మరునాడు గవర్నమెంటు ఆస్పత్రిలో చేరిన కుటుంబరావును పరామర్శించాలని తన కొడుకుతో వెళ్ళాడు రామనాథం. కుటుంబరావుకు లివర్ పెరిగింది. త్రాగుడుకు బానిసై లక్షలాది రూపాయిలు మంచినీళ్ళప్రాయంగా ఖర్చుచేసి ఈ స్థితికి చేరిన కుటుంబరావు గురించి వూసగుచ్చినట్టు కొడుకుతో చెప్పాడు రామనాథం.

మత్తు పదార్థాల వాసన కూడా చూడకూడదనుకుంటున్నట్టు శివం తండ్రితో చెప్పాడు. సంతోషం రామనాథంలో పరవళ్ళు తొక్కింది.

అలానే వ్యభిచారానికి అలవాటుపడ్డ మన్మథరావును చూపించాడు. అతడు సుఖరోగాలతో బాధపడుతున్నాడు.

ఆడదాని వంక కన్నెత్తయినా చూడకూడదు అని అంటున్న కొడుకు కేసి గర్వంగా చూశాడు రామనాథం.

పేకాట వ్యసనానికి బానిసయి లక్షలాది రూపాయిలు ఆ ఆటలో తగలెట్టాకగాని గిరీశానికి ఆ ఆట ఎంత ప్రమాదకరమో తెలిసొచ్చింది. ఆ ఆటకు లోను కాకుండా వుంటే తానెంతో పై స్థాయిలో వుండేవాడినని తన జీవితం హాయిగా గడిచిపోయి వుండేదని, ఇప్పుడు దరిద్రంతో రోజులు వెళ్ళబుచ్చవలసివచ్చిందని - తనను చూడవచ్చిన రామనాథం, అతని కొడుకు శివంతో చెప్పాడు గిరీశం.

'పేక ముక్కల్ని చేత్తో కూడా ముట్టుకోకూడదు డాడీ' అన్నాడు శివం. రామనాథం హృదయం సంతృప్తితో పొంగిపోయింది.

వ్యసనాలంటే తన కొడుక్కి ద్వేషం కలిగేలా చేయగలుగుతున్నందుకు మురిసిపోసాగాడు రామనాథం.

లాటరీ టిక్కట్ల పిచ్చిలో పడి లక్షల ఆస్తిని లాటరీ టిక్కట్ల రూపంలోకి మార్చి ఇల్లు గుల్లచేసి రోజులు గడపడమే గగనంగామన్న గంగాధరం వద్దకు తీసుకెళ్ళాలని ఆ రోజు కొడుకుతో బయలుదేరాడు రామనాథం. అతన్ని చూస్తే లాటరీ జోలికి పోడు తన కొడుకు.

గంగాధరం ఇల్లు జనంతో కిటకిటలాడుతూంది. ఇంటి ముందు ఎన్నో కార్లు. నగర ప్రముఖులంతా అక్కడే వున్నారు. ఆ జనంలో లోనికి వెళ్ళలేక పోయాడు రామనాథం.

"ఏమిటీ సంగతి?" రామనాథం ప్రశ్నించాడు.

"పది రూపాయిలతో కొన్న లాటరీ టిక్కెట్టుకు గంగాధరంగారికి కోటి రూపాయలొచ్చాయట. ఆయన్ని అభినందించడానికే వీరంతా వచ్చారు" అని చెప్పారు.

"డాడీ డబ్బు సులువుగా సంపాదించేందుకు లాటరీ టిక్కట్లు కొనడం తప్పించి వేరో మార్గం లేదు. నేనూ లాటరీ టిక్కట్లు కొంటాను. కోట్ల రూపాయిలు సంపాదిస్తాను" పూనకం వచ్చినవాడిలా శివం తండ్రితో చెప్తూ పోతున్నాడు. రామనాథం తల బాదుకోవడం చాలామంది చూశారు. ●